క్లుప్తంగా

వసతులు కల్పించాలి..



బ్రైటర్ ఫ్యూచర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: చిల్డ్రన్ హోమ్‌లలో అన్ని వసతులు కల్పించాలని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్. అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని బ్రైటర్ ఫ్యూచర్, రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. భోజనం, వసతి సౌకర్యాలపై ఈ సందర్భంగా ఆరా తీశారు. కార్యక్రమంలో వై. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాల నిర్మూలనలో అధికారులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును శుక్రవారం ఆయన కార్యాలయంలో అప్పారావు కలిశారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించేందుకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఇన్నర్‌వీల్ సభ్యులు

విజయనగరం: నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు శ్రీలత మాట్లాడుతూ, ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శిరీష, కోశాధికారి రోజా, సభ్యులు రాధిక, ఉమా, కుమారి, అనిత, ఐశ్వర్య, తదితరులు పాల్గొన్నారు.

పినవేమలిలో ముగిసిన నవమి వేడుకలు



పినవేమలిలో అన్నదానం

విజయనగరం రూరల్: మండలంలోని పినవేమలిలో శ్రీరామనవమి వేడుకలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పీవీఎస్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో 11 వంటకాలతో సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సైలాడ గోవిందరావు, పడాల సత్యనారాయణ, అప్పారావు, పడాల రమణ, మసాడ ప్రసాద్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


రామకోటి ప్రతుల సమర్పణ



రామకోటి ప్రతులను సమర్పిస్తున్న భక్తులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో భక్తులు రాసిన రామకోటి ప్రతులను రామస్తూపంలో శుక్రవారం భద్రపరిచారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన భక్తులు శుక్రవారం నాటికి 22 కోట్ల 4 లక్షలకు పైగా రామకోటి నామాల ప్రతులను అందజేశారని ఆలయ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో డీఈఓ లింగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచిన నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల (కస్పా) విద్యార్థులను జిల్లా విద్యా శాఖాధికారి బి. లింగేశ్వరరెడ్డి అభినందించారు. ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది విద్యార్థులు డీఈఓను శుక్రవారం కలిశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న బాసట...

- వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ



మహిళలకు చెక్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

పూసపాటిరేగ: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో వైఎస్సార్ ఆసరా మూడోవిడత చెక్‌లు పంపిణీ చేశారు. మండలంలోని 1575 మహిళాసంఘాలలో 17,495 సభ్యులకు 12 కోట్ల 33 లక్షల రుపాయల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను నాలుగు విడతలలో మాఫీ చేస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తోందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని.. ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతున్నామని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా, అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి జగనన్న పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. పేదలకు మేలు జరుగుతుంటే చంద్రబాబు ఓర్వలేకే అసత్య ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో వెన్నుపోటు రాజకీయాలకు తెరదీసిన చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ప్రజాబలం ఉందని.. ఎవరెన్ని కుట్రలు చేసినా ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్ కంటివెలుగు పథకంలో భాగంగా మంజూరైన కళ్లద్దాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ. భాస్కరరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ సత్యనారాయణమూర్తి, ఎన్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, పి. లక్ష్మీనారాయణ, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, టి.సీతారాం, దాడిశెట్టి త్రినాథరావు, బర్రి చిన అప్పన్న, దేశెట్టి గణేష్, అమర గురువులు, రౌతు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన డ్వాక్రా సంఘాల సభ్యులు

హిందువుల ఐక్యతకు నిదర్శనం శ్రీరామనవమి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడవాడలా సీతారాముల కల్యాణాలు, పట్టాభిషేకాలు ఘనంగా నిర్వహించడం హిందువుల ఐక్యతను రుజువు చేస్తోందని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శ్రీరామనవమి నేపథ్యంలో సుంకరవీధిలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రామచంద్రుడి జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో కోరాడ భాస్కరరావు, రెల్లి సంతోష్, చల్లా సత్యనారాయణ, మజ్జి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నల్ల ఇసుక స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని పులిగెడ్డ సమీపంలో నల్ల ఇసుక నిల్వను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎ.నరేష్ శుక్రవారం తెలిపారు. కొంతకాలంగా పులిగెడ్డ సమీపంలో ఇసుకను డంప్ చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు పోలీస్, భూగర్భగనుల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టి ఇసుక సీజ్ చేసినట్లు చెప్పారు.

మెజీషియన్ శ్యామ్‌కు కీర్తి పురస్కార్



కీర్తి పురస్కారం అందుకుంటున్న మెజీషియన్ శ్యామ్

విజయనగరం టౌన్: ప్రముఖ ఇంద్రజాలికుడు శ్యామ్‌కు శ్రీ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ (హైదరాబాద్) కీర్తి పురస్కారాన్ని అందజేసింది. ప్రతి ఏటా జాతీయస్థాయిలో ప్రముఖ కళాకారులను ఎంపిక చేసి యూనివర్సిటీ అవార్డులు అందజేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన శ్యామ్‌కు ఈ నెల 29 యూనివర్సిటీలోని నందమూరి తారకరామారావు కళాప్రాంగణంలో వీసీ తంగడ కిషన్‌రావు, రిజిస్ట్రార్ బట్టు రవి పురస్కారాన్ని అందజేశారు.

నగరంలో కన్యా సురక్ష స్థూపం



అఖిల భారతీయ తేరా పంథ్ మహిళా మండల్ జిల్లా కమిటీ ప్రతినిధులతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- నిర్మాణానికి ముందుకు వచ్చిన జైన మహిళలు

విజయనగరం: మహిళల రక్షణ నినాదంతో స్థూపం ఏర్పాటుకు జైన మహిళలు ముందుకు రావడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అఖిల భారతీయ తేరా పంథ్ మహిళా మండల్ జిల్లా కమిటీ ప్రతినిధులు కోలగట్లను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాము ఏర్పాటు చేయబోయే కన్యా సురక్ష స్థూపం ఆవశ్యకతను ఈ సందర్భంగా వివరించారు. విజయనగరంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ సమీపంలో స్థూపం ఏర్పాటు చేయనున్నామని, అందుకు సహకారం అందించాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించాలన్న ప్రధాన ఉద్దేశంతో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ తరహా స్థూపాలను నెలకొల్పుతున్నట్లు జిల్లా శాఖ అధ్యక్షురాలు రీటాదేవి అంచాలియా తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మహిళా మండల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు నెల్లిమర్లలో ఆసరా కార్యక్రమం

నెల్లిమర్ల: పట్టణంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన మూడో విడత మొత్తాలను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మంటపంలో నిర్వహించే కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు గురునారాయణ కళాపీఠం వార్షికోత్సవం

విజయనగరం టౌన్: శ్రీ గురునారాయణ కళాపీఠం ప్రథమ వార్షికోత్సవం శనివారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కళాపీఠం వ్యవస్థాపకుడు బీఏ నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురమే సుధాగానం పేరుతో సుమారు 40 మంది గాయనీ, గాయకులు తమ గానామృతంతో అలరిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ చలన చిత్ర సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌ను ఘనంగా సత్కరిస్తామన్నారు. సంగీతాభిమానులందరూ తరలిరావాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పైడితల్లి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో పైడితల్లి ఆలయ పునర్నిర్మాణానికి వేదపండితుల అధ్వర్యంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, 40 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవ తీసుకుని మళ్లీ కొత్తగా ఆలయాన్ని నిర్మించేందుకు దేవదాయశాఖ నుంచి సుమారు రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించడమే కాకుండా తనవంతు సాయంగా రూ.10 లక్షలు అందజేశారని చెప్పారు. త్వరితగతిన పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ సర్పంచ్ పతివాడ రామకృష్ణ, కర్రోతు శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతు పైడిరాజు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ప్రసాద్ దంపతులు

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి వితరణ

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జానా ప్రసాద్, రమణమ్మ దంపతులు లక్ష రూపాయలు వితరణగా అందజేశారు. ఈ మేరకు స్థానిక శాఖా గ్రంథాలయం సమీపంలో హాల్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ జానా సంధ్యారాణి, బంగారు రాము, బంగారు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ



విద్యార్థికి పరీక్ష కిట్ అందజేస్తున్న ఉషోదయ ప్రతినిధులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన పదో తరగతి విద్యార్థులకు స్థానిక ఉషోదయా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష మెటీరియల్ కిట్లను శుక్రవారం అందజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎయిమ్స్ విద్యాసంస్థల అధినేత కడగల ఆనంద్‌కుమార్, మిమ్స్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ అరిపాక శ్రీనివాసరావు విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు మన్యపురి మోహనరావు, కాళ్ల విజయ్‌కుమార్, కనకల రామారావు, ఉపాధ్యాయులు రాజేష్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో సమష్టి భాగస్వామ్యం



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: సామాజిక సేవా కార్యక్రమాలలో సమష్టి భాగస్వామ్యం అవసరమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 19వ డివిజన్ ఆది ఆంధ్ర పాఠశాల పక్కన ఏర్పాటు చేసిన వసతిగృహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసతిగృహంలో విద్యార్థులకు అవసరమైన 70 పరుపులు, పది ఫ్యాన్లు అందజేయనున్నట్లు తెలిపారు. వసతిగృహ నిర్వహణకు ముందుకు వచ్చిన శ్రీ గ్రంథాలయ సంస్థ నిర్వాహకులను కోలగట్ల అభినందించారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, స్థానిక కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లంక వరలక్ష్మి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పట్టా ఆదిలక్ష్మి, కనకల నాగవల్లి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నారీమణి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 46.10 లక్షలతో అభివృద్ధి పనులు



32వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగరంలోని 32,37 డివిజన్ల పరిధిలో రూ. 46.10 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, ఆదర్శ డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి సమస్యనూ కోలగట్ల పరిష్కరిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. 37వ డివిజన్ కార్పొరేటర్ కడియాల రామకృష్ణ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేనివిధంగా శివారు కాలనీలను సైతం అభివృద్ధి చేస్తున్న ఘనత కోలగట్లకే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, 32వ డివిజన్ కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, భోగాపురపు రవిచంద్ర, మిందే రాధారాణి పాల్గొన్నారు.

ముగిసిన వడ్డీ మాఫీ పథకం

- ఆర్థిక సంవత్సరం చివరి రోజు రూ. కోటికి పైగా పన్నుల వసూలు



పన్ను చెలిస్తున్న నగర ప్రజలు

విజయనగరం: ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లు జోరుగా సాగాయి. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ పథకం గడువు శుక్రవారం రాత్రి 12 గంటలతో ముగియనుండడంతో పన్నులు బకాయిపడిన వారు శుక్రవారం ఉదయానికే కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పన్నులు చెల్లించారు. కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు ఉదయం 6 గంటల నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉండి పన్ను వసూళ్లను పర్యవేక్షించారు. 887 అసెస్‌మెంట్ల నుంచి రూ.72 లక్షల వసూలు చేయగా... ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా 52,198 అసెస్‌మెంట్ల నుంచి రూ. 37.40 కోట్లు వసులైనట్లు అధికారులు వెల్లడించారు.

‘ఉపాధి’ పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీడీ శారదాదేవి, తదితరులు

పూసపాటిరేగ: ఉపాధిహామీ పథకం పనులలో ఎవెన్యూ ప్లాంటేషన్, లే అవుట్ నిర్మాణాలలో అవకతవకలు జరిగినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద 2021–22 ఉపాధి హామీ పనులు, 2019 – 2022 వరకు కాలనీ లేఅవుట్ నిర్మాణాలకు సంబంధించిన సుమారు 22 కోట్ల 45 లక్షల రూపాయల పనులకు సంబంధించిన 799 పనులకు ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాలలో వేసిన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కల్లో దాదాపు 25 శాతం లేనట్లు గుర్తించారు. పేరాపురంలో పనులు చేయకుండానే అడ్వాన్స్‌లు తీసుకున్నట్లు ఆడిట్‌లో తెలియజేశారు. కనిమెల్ల, కందివలసలో వేతనదారులకు హాజరు సక్రమంగా వేయలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ ఎం.శారదాదేవి, ఎంపీడీఓ జి.రామారావు, ఎస్‌ఆర్‌పీ గోవిందరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, ఎన్. సత్యనారాయణరాజు, గుజ్జు సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం చేస్తే సహించేది లేదు

- ట్రాఫిక్ డీఎస్పీ మోహన్‌రావు



తొలగించిన సౌండ్ బాక్సులతో ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, తదితరులు

విజయనగరం క్రైమ్: నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో స్పీకర్లు ఏర్పాటు చేసి శబ్ద కాలుష్యం చేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మోటారు వాహన చట్టం నిబంధనలు పాటించని ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోల్లో ఏర్పాటు చేసిన స్పీకర్లు, సౌండ్‌బాక్సులు తొలగించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయమే లక్ష్యం..



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- పార్టీ సిద్ధాంతాలే మన అజెండా
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



కార్యక్రమానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

విజయనగరం: పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలు, నాయకుల్లో ఎవరికైనా నిరాశ నిస్పృహలుంటే తక్షణమే పార్టీని విడనాడాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని, ఏడో తేదీ నుంచి ప్రజల ముంగిటకు వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించాలని సూచించారు. పేద ప్రజలను ఆదుకునే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. పార్టీకి ఎవ్వరు నష్టం చేకూర్చినా క్షమించేది లేదన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కోలగట్ల వీరభద్రస్వామిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం శాసనమండలి సభ్యుడిగా రెండోసారి గెలుపొందిన డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, మండల అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపిన శ్రీనివాసరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్‌చార్జ్‌లు కోలగట్ల కృష్ణారావు, డాక్టర్ వీఎస్ ప్రసాద్, బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.